
# వసూళ్లకు పాల్పడిన ఉద్యోగుల తొలగింపు

- కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి ప్రకటన
- 'నమస్తే' ఎఫెక్ట్




హనుమకొండ చౌరస్తా, జనవరి 11 : కేయూలో డబ్బులు తీసుకుని సర్టిఫికెట్ ఇస్తున్న ఉద్యోగులపై వేటు పడింది. గురువారం 'నమస్తే'లో ప్రచురితమైన 'రూ.2500 ఇస్తేనే సర్టిఫికెట్' అనే కథకానికి కేయూ అధికారులు స్పందించారు. సంబంధిత ఉద్యోగులను విధుల నుంచి తొలగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు పరీక్షల మెమోలు వారి కాలేజీల నుంచి తీసుకోవాలని, రీ వాల్యుయేషన్‌లో బెనిఫిట్ పొందిన విద్యార్థులు నేరుగా పరీక్షల విభాగానికి వచ్చి తీసుకోవాలని సూచించారు.




మానుకోట లోక్‌సభ నియోజకవర్గ పరిధి నేతల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

'కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తామని ఏనాడూ అనుకోలేదు.. నోటికి ఏదొస్తే అది హామీ ఇచ్చి ప్రజలను మభ్యపెట్టిండ్రు.. వాళ్ల మోసపూరిత వాగ్దానాలను నమ్మి, గొప్పగా పనిచేసిన నాయకులను కూడా ప్రజలు తిరస్కరించారు.. రానున్న పార్లమెంట్ ఎన్నికలు మన గెలుపునకు సోపానం కావాలి.. కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం సన్నాహక సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.
- మహబూబాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ)

# మానుకోట గడ్డపై గులాబీజెండా ఎగరాలి

- కాంగ్రెస్ పార్టీవి 420 హామీలు..
- ఆ పార్టీ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలి
- మహబూబాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హాజరైన ఏడు నియోజకవర్గాల ముఖ్య నాయకులు

మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంపై గులాబీ జెండా ఎగరేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శ్రేణులకు పిలుపునిచ్చారు. 2014, 2019లో విజయం సాధించామని, ఈ సారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు మనకు పదేళ్లు అవకాశమిచ్చారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలించినట్లు తెలిపారు. తాము అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ వాళ్లు అనుకోలేదని, నోటికి ఏదొస్తే అది హామీ ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారని అన్నారు. ఆరు గ్యారెంటీలు అన్నారు.. కానీ, అవి 420 హామీలని, వాళ్ల తప్పుడు ప్రచారాన్ని నమ్మి ప్రజలు గొప్పగా పని చేసిన నాయకులను కూడా తిరస్కరించినట్లు తెలిపారు. దేశంలో అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది మన ప్రభుత్వమేనని, ప్రభుత్వ ఉద్యోగులకు అత్యధిక వేతనాలు ఇచ్చింది మన ప్రభుత్వమేనని, అయినా ఏనాడూ చెప్పుకోలేదు.. ప్రచారం చేసుకోలేదన్నారు. దేశంలో అందరికన్నా ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులకు 73శాతం జీతాలు పెంచిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. స్థానిక సంస్థల నుంచి మొదలుకొని అసెంబ్లీదాకా బలమైన నాయకత్వం మనకున్నదని, బలమైన ప్రతిపక్షం మనదన్నారు. అన్నిటికీ మించి కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడు మనకున్నారని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలే మన గెలుపునకు సోపానం కావాలన్నారు. ఎన్నికల ముందు రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి అనేక మాటలు మాట్లాడారని, రుణం ఉన్నవాళ్లే కాదు.. లేనివాళ్లు కూడా తీసుకోండి.. మేము అధికారంలోకి రాగా వెంటనే రుణమాఫీ చేస్తామన్నారు.. కానీ, ఇంత వరకు అతీగతీ లేదన్నారు. ఇచ్చిన అడ్డగోలు హామీలను నెరవేర్చే దారిలేకనే అప్పులు, శ్వేతపత్రాలంటూ నాటకాలు ఆడుతున్నారని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే స్వేద పత్రం

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..

రూపొందించామన్నారు. ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, మన పార్టీకి బలమైన నాయకులు, అద్భుతమైన నాయకత్వం ఉన్నదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాలను వరుసగా పెట్టుకుంటూ, అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తూ, అన్ని వర్గాలకు దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడుతామన్నారు. గిరిజనులకు స్థానిక సంస్థల రిజర్వేషన్‌తోపాటు పోడు పట్టాల పంపిణీ, అనేక ఇతర సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం అందించినా ప్రజలు మనకు పూర్తి మద్దతు ఇవ్వలేదన్నారు. ఇలాంటి అంశాలను విమర్శచేసుకుంటూ ముందుకెళ్దామని కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## నాలుగు మెడికల్ కాలేజీలు ఇచ్చాం.. - సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో నాలుగు మెడికల్ కాలేజీలు ఇచ్చామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయం, రోడ్లను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ గోబెల్స్ ప్రచారాన్ని గ్రామాల్లో చర్చ చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అందరం కష్టపడి పని చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసుల నుంచి కార్యకర్తలను కాపాడేందుకు ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీలు వేసుకొని పార్టీ బలోపేతానికి మరింత కృషి చేద్దామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియానాయక్, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, మాజీ ఎంపీ సీతారాంనాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవో అంకిత్

# మేడారం పనులు గిరిజనులకే ఇవ్వాలి

- జాతర ట్రస్టు బోర్డులో గిరిజనేతరులను నియమించొద్దు
- ఇలవేల్పుల సమ్మేళనానికి బడ్జెట్ కేటాయించాలి
- మేడారంలో ఆదివాసీ భవన్ నిర్మించాలి
- ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన సంఘాల ప్రతినిధులు
- ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో జాతర నిర్వహణ సమన్వయ సమావేశం
- సమస్యలను ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తా : అంకిత్

ఏటూరునాగారం, జనవరి 11 : మేడారం మహా జాతర సందర్భంగా చేసే అభివృద్ధి పనుల్లో గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలని గిరిజన సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఉమ్మడి వరంగల్ పరిధిలోని గిరిజన సంఘాల ప్రతినిధులతో ఐటీడీఏ పీవో అంకిత్ మేడారం జాతర నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ జాతర నిర్వహణలో ఆదివాసీ సంఘాలు, పూజారుల పాత్ర చాలా కీలకమైందని, అభివృద్ధి పనుల్లో గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. మద్యం, కొబ్బరి, బెల్లం దుకాణాలు ఆదివాసీ సంఘాలు, పూజారులకు మాత్రమే కేటాయించాలన్నారు.

గిరిజనేతరులకు దుకాణాల కేటాయింపు, అభివృద్ధి పనులు అప్పగించొద్దన్నారు. ప్రభుత్వం ఆమోదించిన ధరల ప్రకారం ఆదివాసీ సంఘాలకు మద్యం షాపులు కేటాయించాలన్నారు. మద్యం షాపులు నడిపేందుకు వారం మాత్రమే గడువు ఇస్తున్నారని, కనీసం 15 రోజులు అనుమతి ఇవ్వాలన్నారు. మేడారం ట్రస్టు బోర్డు నియామకంలో గిరిజనేతరులను నియమించొద్దని కోరారు. ప్రతి జాతర సమయంలో ఇలవేల్పుల సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని, ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయించాలన్నారు. గిరిజన సంస్కృతికి మినహా జాతర సమయంలో నిర్వహించే చారిటబుల్ ట్రస్టులకు అనుమతించవద్దన్నారు. మేడారంలో ఆదివాసీ భవన్ నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలని కోరారు. గిరిజన యువతకు మేడారంలో డిపార్ట్‌మెంటు ద్వారా చేపట్టే పనులు ఇవ్వాలన్నారు. ఐటీడీఏ ద్వారా ఉపాధి రుణాలు మంజూరు చేయాలని కోరారు. అమ్మవార్లను గద్దెలకు తీసుకవచ్చే సమయంలో రోప్ పార్టీని ఆదివాసీ పోలీస్ అధికారులు మాత్రమే నిర్వహించాలని కోరారు. పీవో అంకిత్ మాట్లాడుతూ ఆదివాసీ సంఘాలు అందించిన సలహాలు సూచనలతో మేడారం జాతర సజావుగా సాగే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఐటీడీఏ స్థాయిలో తీర్చే సమస్యలను పరిష్కరించి, ఇతర సమస్యలను ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. మేడారం జాతరలో పాల్గొనే ఆదివాసీ సంఘాలకు గ్రీన్ టీ షర్టులు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోదర్‌స్వామి, రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్, జియాలజిస్టు కిశోర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సంఘాల నాయకులు దాట్ల నాగేశ్వర్‌రావు, పొడెం బాబు, పొడెం రత్నం, కొప్పుల రవి, పొదెం కృష్ణ ప్రసాద్, మైపతి అరుణ్‌కుమార్, కే లక్ష్మణ్‌రావు, సుభద్ర, సుధాకర్, గొప్ప సమ్మారావు, కబ్బాక శ్రావణ్, దబ్బగట్ల సుమన్, కొమురం రామ్మూర్తి, పొడె శోభన్ పాల్గొన్నారు.

# కొత్తకొండ జాతరలో ఉచిత వీఐపీ దర్శనం రద్దు

భీమదేవరపల్లి, జనవరి 11 : కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ఉచిత వీఐపీ దర్శనం రద్దు చేసినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు గురువారం వెల్లడించారు. ఇటీవల కొత్తకొండలో వీరభద్రస్వామి జాతరపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వీఐపీ పాసులు రూ.200చొప్పున టిక్కెట్టు నిర్ణయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అతని తరపున రూ. 200 చొప్పున 500వీఐపీ పాసులు, రూ. 100చొప్పున 500 శీఘ్ర దర్శనం టిక్కెట్లను రూ. 1,50,000చెల్లించి కొనుగోలు చేశారని ఈవో కిషన్‌రావు వెల్లడించారు. దీంతో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న సాధారణ భక్తులకు కాసింత ఊరట లభించింది.

### జాతరకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులు..

భీమదేవరపల్లి : కొత్తకొండ జాతరకు హుజూరాబాద్ డిపో నుంచి 20 ఆర్టీసీ బస్సులు కేటాయించినట్లు డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ తెలిపారు. కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నెల 14,15, 16వ తేదీల్లో హుజూరాబాద్ నుంచి కొత్తకొండకు 20బస్సులు ద్వారా 80ట్రిప్పులు నడుస్తాయని తెలిపారు. పెద్దలకు రూ. 60, పిల్లలకు రూ. 30 టికెట్ ఉంటుందన్నారు.

# నువ్వెంత.. నీ లెక్కెంత?

- కాంగ్రెస్ పార్టీలో వీధికెక్కిన వర్గపోరు
- బయ్యారం మండల కేంద్రంలోని కార్యాలయం వేదికగా రెండు వర్గాల రచ్చరచ్చ
- ఓ వర్గం ప్రెస్‌మీట్ పెడుతుండగా..., అడ్డుకున్న మరోవర్గం
- కుర్చీలు, బల్లలు విసురుకుంటూ ఘర్షణ
- పోలీసుల రాకతో సద్దుమణిగిన వివాదం
- పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని సీనియర్ల ఆవేదన
- మండలంలో చర్చనీయంగా కాంగ్రెస్ తీరు

బయ్యారం, జనవరి 9 : 'కాంగ్రెస్ అంటే ఇంతేనా..' అని అనుకొనేలా ఆ పార్టీలో మరోసారి వర్గపోరు వీధికెక్కింది. ఇంతకాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు గురువారం బయ్యారం మండలంలోని పార్టీ కార్యాలయం వేదికగా బట్టబయలైంది. 'నువ్వెంత.. అంటే నువ్వెంద' అంటూ రెండు వర్గాలు చేసిన రచ్చ మండలంలో చర్చనీయంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ముసలయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభమవుతున్న సమయంలో మరో వర్గానికి చెందిన నాయకులు వచ్చారు. తాము కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులమేనని, తమకు సమాచారం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. దీంతోపట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కలిగించుకొని పార్టీని నమ్ముకున్న ఉన్న వారు కాకుండా పార్టీకి సంబంధంలేని కొందరు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించాడు. దీంతో మరోవర్గం నాయకులు సైతం పార్టీ కోసం తాము కష్టపడ్డామని, ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేశామని ఎదురుదాడికి దిగారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా అనేక ఇబ్బందులు పడుతూ పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నామని పాత కాంగ్రెస్ నాయకులు వాపోగా, ఎన్నికల్లో గెలుపు కోసం తాము కూడా తీవ్రంగా కృషి చేశామని



పరస్పరం దూషించుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నాయకులు వారితో వాదించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగింది. తీవ్ర పదజాలంతో వాగ్వాదం చేసుకున్నారు. ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నారు. నువ్వెంత.. అంటే నువ్వెంత.. అంటూ ఘర్షణ పడ్డారు. ఒకరిపైకి మరొకరు కుర్చీలు, బల్లలు విసురుకున్నారు. సుమారు గంటపాటు కార్యాలయంలో రచ్చరచ్చ చేశారు. ఓ వర్గం నాయకులు ఎమ్మెల్యే కనకయ్య.. భరత్‌చంద్రారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అని.. నినాదాలు చేయగా.. మరోవర్గం ఎమ్మెల్యే కనకయ్య, జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, మంత్రి పొంగులేటి నాయకత్వం వర్ధిల్లాలి అని పోటీపడి నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. పోలీసుల ఎదుటే వాగ్వాదం చేసుకున్నారు. ఎస్సై ఉపేందర్ ఇరువర్గాలకు సర్దిచెప్పి కార్యాలయం నుంచి వారిని బయటికి పంపి గేట్లు వేశారు. ఈ క్రమంలో కొందరు సీనియర్ నాయకులు వివాదాలతో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్‌లో వర్గపోరు బయ్యారం మండలంలో చర్చనీయంగా మారింది. పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజులకే నాయకులు రచ్చకెక్కడంతో స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో పోటీ పడాల్సిన నాయకులు.. ఆధిపత్యం కోసం తగాదాలకు దిగడమేంటని విసుక్కున్నారు. అయితే, ఎమ్మెల్యేగా కోరం



బయ్యారంలో బాహాబాహీకి దిగిన రెండు వర్గాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు

కనకయ్య ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజులకే అధికారులతో బయ్యారం సొసైటీలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. దీనిని ఓ వర్గం నాయకులు విభేదించడంతో ఎమ్మెల్యే వాయిదా వేశారు. అప్పటి నుంచే ఇరువర్గాల మధ్య వర్గపోరు తార స్థాయికి చేరినట్లు సమాచారం.

### కాంగ్రెస్ పార్టీతో మధుకర్‌రెడ్డికి సంబంధం లేదు..

కాంగ్రెస్ పార్టీకి సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మండల అధ్యక్షుడు కంబాల ముసలయ్య గురువారం ఒక ప్రకటనలతో తెలిపారు. సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి రెండు నెలల క్రితం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ కండువా కప్పుకోకుండా.., పది సంవత్సరాలుగా కాంగ్రెస్ జెండా మోసిన నాయకులపై పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల బయ్యారం ఎంపీపీపై అవిశ్వాసం పెట్టి మిర్యాలపెంట ఎంపీటీసీ సోమేశ్‌ను ఎంపీపీ చేసే విషయంలో సైతం అడ్డుపడ్డాడని, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బయ్యారం కార్యాలయంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసుకుంటే కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని వ్యక్తి కొంతమందిని తమపైకి ఉసిగొల్పాడని, వారు చంపుతామని బెదిరించారని తెలిపారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి గారి నాయకత్వంలో తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో ప్రయాణికులతో కిక్కిరిసిన హనుమకొండ బస్టాండ్

# ఆర్టీసీకి సంక్రాంతి సందడి

- పండుగకు 300 ప్రత్యేక బస్సులు
- సొంతూళ్లకు పయనమవుతున్న ప్రజలు
- కిక్కిరిసిన హనుమకొండ బస్‌స్టేషన్

హనుమకొండ చౌరస్తా, జనవరి 11 : ఆర్టీసీకి సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. బస్సుల రాకపోకలు, ప్రయాణికులతో హనుమకొండ బస్‌స్టేషన్ హడావుడిగా కనిపించింది. హైదరాబాద్, కరీంనగర్, ఏటూరునాగారం, ములుగు, భూపాలపల్లి, పరకాల, పాలకుర్తి, నిజామాబాద్, ఖమ్మం, నర్సంపేట రూట్లలో రద్దీ ఎక్కువగా ఉన్నందున ఆయా రూట్లలో బస్సుల సంఖ్య పెంచారు. వరంగల్ బస్‌స్టేషన్, ములుగురోడ్డు, వరంగల్ అండర్‌బ్రిడ్జి, పబ్లిక్‌గార్డెన్ ప్రాంతాల నుంచి కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు సొంత గ్రామాలకు తరలి వెళ్లారు. వరంగల్-1, 2, హనుమకొండ, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, పరకాల, భూపాలపల్లి, జనగామ డిపోల వారీగా బస్సులను నడిపిస్తున్నారు. ఈ నెల 12 నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు లగేజీలతో బస్‌స్టేషన్ల బాట బట్టారు. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ వరంగల్ రీజియన్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అదనపు సర్వీసులను నడిపిస్తున్నారు. సుమారు 300 వరకు అదనంగా బస్సులను తిప్పుతున్నారు. గత సంవత్సరం కంటే బస్సుల సంఖ్యను పెంచారు. రద్దీగా ఉన్న రూట్లలో అదనపు సర్వీసులను తిప్పుతున్నారు.


### అదనపు సర్వీసులు నడిపిస్తున్నాం..

సంక్రాంతి పండుగ సందర్భంగా వరంగల్ రీజియన్ పరిధిలో 300 అదనపు బస్సు సర్వీసులను నడిపిస్తున్నాం. ప్రతి రోజూ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు ట్రిప్పులు తిప్పిస్తున్నాం. హైదరాబాద్ రూట్‌లో రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రతి రోజూ 150అదనపు ట్రిప్పులు తిరుగుతున్నాయి.
- శ్రీలత, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

# ఏసీబీ వలలో అవినీతి తిమింగలాలు

రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్
అదుపులోకి తీసుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు.. నేడు ఏసీబీ కోర్టుకు తరలింపు

జనగామ చౌరస్తా, జనవరి 11: జనగామ జిల్లాలో రెండు అవినీతి తిమింగలాలు ఏసీబీకి చిక్కాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శేపూరి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ ఎండీ అజాద్ రూ. 50 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కాముని స్రవంతి మండలంలోని ఓబుల్ కేశవాపూర్ పీహెచ్‌సీలో ఔట్‌సోర్సింగ్ ఫార్మాసిస్ట్‌గా మూడేళ్ల నుంచి పనిచేస్తున్నది. ఈమె స్థానంలో 2023 అక్టోబర్‌లో రెగ్యులర్ ఫార్మాసిస్టు విధుల్లో చేరగా, స్రవంతిని రఘునాథపల్లి పీహెచ్‌సీకి మార్చారు. అక్కడ వారం రోజుల పాటు పనిచేయగానే ఉన్నఫళంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సమాచారం అందింది. దీంతో బాధితురాలు తీవ్ర మనోవేదనకు గురై డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంత్‌ను కలిసి తనను ఉద్యోగం నుంచి తొలగించొద్దని వేడుకుంది. ఈ క్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగంలో కొనసాగాలన్నా, 2 నెలల వేతనం చెల్లించాలన్నా రూ. లక్ష ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ అజార్ ద్వారా డీఎంహెచ్‌వో డిమాండ్ చేశారు. దీంతో స్రవంతి వరంగల్ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించింది. వారం రోజుల కింద మొదటి విడుతగా రూ.50 వేలను జూనియర్ అసిస్టెంట్ అజార్ చెప్పిన విధంగా డీఎంహెచ్‌వో కార్యాలయం డిప్యూటీ డీఎంహెచ్‌వోకు సంబంధించిన టేబుల్ డ్రాలో పెట్టింది. ఆ తర్వాత రెండోసారి గురువారం మిగతా రూ.50 వేల నగదును డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంత్ చాంబర్‌లోని టేబుల్ డ్రాలో స్రవంతి పెడుతున్న క్రమంలో ఏసీబీ అధికారులు డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్ అజార్‌ను పట్టుకున్నారు. నిందితులిద్దరూ లంచం డబ్బులను నేరుగా ముట్టుకోకపోయినా, బాధితురాలు స్రవంతితో సెల్‌ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు, లంచం నగదును టేబుల్ డ్రాలో పెట్టమన్న వీడియో రికార్డుల ఆధారంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంత్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ అజార్‌పై కేసు నమోదు చేశారు. నిందితులిద్దరినీ శుక్రవారం హైదరాబాద్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. కాగా, మరో 3 నెలల్లో డీఎంహెచ్‌వో ప్రశాంత్ రిటైర్‌మెంట్ అవుతున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు జే శ్యామ్‌సుందర్, కే శ్రీను, ఎన్ రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడిన డీఎంహెచ్‌వో, జేఏ



ధర్నా చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

## కళాశాల భూములను లాక్కోవద్దు

కాశీబుగ్గ, జనవరి 11: హైకోర్టు నిర్మాణానికి రాష్ట్ర సర్కారు వ్యవసాయ యూనివర్సిటీ భూములను ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఆరెపల్లిలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆందోళన చేశారు. వెంటనే జీవో 55ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భావితరాల వ్యవసాయ పరిశోధనలకు ఎంతో ఉపయోగపడే భూములను హైకోర్టుకు కేటాయించడం సరికాదన్నారు. పరిశోధనల కోసం మరిన్ని భూములు కేటాయించాల్సిన ప్రభుత్వమే లాక్కోవడం అన్యాయమని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.